క్లుప్తంగా

కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు

తిరుపతి కల్చరల్ : కార్తీక మాసం సందర్భంగా నవంబర్ 4వ తేదీ నుంచి శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు 4, 11, 18, 25 తేదీల్లో వేకువజామున 2 గంటలకు స్వామివారికి విశేష అభిషేకం జరిపించనున్నారు. ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 2 గంటలు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తారు. డిసెంబర్ 1న మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు చండీకేశ్వరస్వామివారికి అభిషేకం, త్రిశూల స్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు లక్షదీపారాధన, పంచ మూర్తులైన శ్రీవిఘ్నేశ్వరస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, శ్రీకపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారు, శ్రీచండికేశ్వరస్వామి వారికి ఆరాధన జరిపించనున్నారు. అనంతరం పంచ మూర్తులను పురవీధుల్లో వైభవంగా ఊరేగించనున్నారు. కార్తీక మాసంలో శ్రీకపిలేశ్వరస్వామివారిని ఆవు పాలతో అభిషేకించి, జాజిపూలు అర్పిస్తే శివస్థానం పొందవచ్చని అర్చకులు వెల్లడించారు.

సిరులతల్లి సేవలో శ్రీకాంత్



ఆలయం వెలుపల శ్రీకాంత్

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సినీనటుడు శ్రీకాంత్ సేవించుకున్నారు. శనివారం ఆలయ వద్దకు చేరుకున్న ఆయనకు అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు తీర్థప్రసాదాలు అందించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో 178 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ : స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 178 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ ఉష మాట్లాడుతూ ప్రముఖ ఎమ్‌ఎన్‌సీ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టి ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉద్యోగావకాశం కల్పించారని వెల్లడించారు. కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తున్న కారణంగా విద్యార్థులు ఉపాధి అవకాశాలు పొందుతున్నారని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రాంగ్ రూట్లో వెళ్లొద్దు

తిరుపతి అర్బన్: తిరుపతిలోని శ్రీనివాససేతుపై రాంగ్ రూట్లో వెళుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని.. అలా చేయడం ద్వారా ప్రమాదాలు చోటుచేసుకుంటాయని జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీనివాస సేతు వంతెనపై ఎదురుగా వాహనాలు వెళ్లడాన్ని తప్పుబట్టారు. బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఉండడం కోసం ఆర్టీసీ సర్వీసులు నేరుగా వంతెనపై నుంచి బస్టాండ్‌లోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటే.. కొందరు ద్విచక్ర వాహనాలతోపాటు కార్లు సైతం బస్టాండ్‌లో నుంచి ఎదురుగా బస్సులు వస్తున్నా పట్టించుకోకుండా రాంగ్ రూట్లో వెళుతున్నారని చెప్పారు. వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 8 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 61,576 మంది స్వామివారిని దర్శించుకోగా 23,412 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.54 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోండి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నేతలు

తిరుపతి అర్బన్ : దివ్యాంగుడైన సచివాలయ ఉద్యోగి సాయికుమార్‌పై వెంకటగిరి మున్సిపల్ కౌన్సిలర్ శేఖర్ దాడికి పాల్పడ్డారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఉపాధ్యక్షుడు వీ.నాగరాజులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

విజ్ఞాన వెలుగులు..
భవితకు బాటలు



ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ

గ్రంథాలు.. పురాణగాథలు.. ఇతిహాసాలు.. నవలలు.. పత్రికలు.. లక్షల సంఖ్యలో పుస్తకాలతో విరాజిల్లుతోంది ఎస్వీయూ గ్రంథాలయం. విజ్ఞాన సముపార్జనకు కొదవ లేని సరస్వతీ నిలయం. విద్యార్థుల ఉన్నతికి బాటలు వేస్తోంది. దశాబ్దాల ప్రస్థానంలో వేలాది మంది భవితకు మార్గనిర్దేశం చేసింది. నిత్యం వందలాది మంది పాఠకులతో కళకళలాడుతోంది. సాహితీ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తోంది. తాజ్‌మహల్ ఆఫ్ సౌత్‌గా మేధావుల ప్రశంసలందుకుంది.

- లక్షల పుస్తకాలతో విలసిల్లుతున్న ఎస్వీయూ కేంద్ర గ్రంథాలయం
- వేలాది మంది విద్యార్థుల ఉన్నతిని నిర్దేశించిన సరస్వతీ నిలయం
- తాజ్ మహల్ ఆఫ్ సౌత్‌గా పేరుగాంచిన అపురూప కట్టడం
- అధునాతన సదుపాయాలతో అక్షర భాండాగారం



గ్రంథాలయంలోని కాంపిటేటీవ్ రీడింగ్ రూమ్‌లో చదువుకుంటున్న విద్యార్థులు



డిజిటల్ లైబ్రరీ

తిరుపతి సిటీ : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని కేంద్ర గ్రంథాలయం ఎందరినో విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దింది. 1955లో ప్రారంభమైన ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ ఇప్పటికీ వేలాది మంది ఉజ్వల భవితకు చేయూతనందిస్తోంది. తొలి రోజుల్లో కేవలం 6వేల పుస్తకాలతో ఈ లైబ్రరీ మొదలైంది. ఇప్పుడు సుమారు 3,97,555 పుస్తకాలతో విరాజిల్లుతోంది. అప్పట్లో మొఘల్ స్ట్రక్చర్‌తో గ్రంథాలయ భవనం నిర్మించారు. ఈ క్రమంలోనే నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ లైబ్రరీని సందర్శించినప్పుడు తాజ్‌మహల్ ఆఫ్ సౌత్‌గా ఈ కట్టడాన్ని అభివర్ణించారు. రోజూ సుమారు ఐదువేల మందికిపైగా విద్యార్థులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఆధ్యాత్మిక వేత్తలు, సాహితీవేత్తలు గంథ్రాలయానికి వచ్చిపోతుంటారు.

అందుబాటులో అన్ని రకాల పుస్తకాలు

ఎస్వీయూ గ్రంథాలయంలో దొరకని పుస్తకం అంటూ ఉండదని పండితులు, విద్యావేత్తలు చెబుతుంటారు. నవలలు, ఇతిహాసాలు, పురాణగాధలు, చరిత్ర, నీతికథలు, రామాయణ, మహాభారత, భాగవతం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు పలు భాషల్లో జ్ఞానం పంచుతున్నాయి. అలాగే వేల సంఖ్యలో ఈ-బుక్స్, ఈ-జనరల్స్, ఈ-డాక్యుమెంట్స్, ప్రింట్ జనరల్స్ సైతం అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు అవసరమైన అడమిక్, ప్రాజెక్ట్ ఓరియెంటెడ్, ఇన్నోవేషన్ సపోర్ట్ స్కిల్స్ వంటి అనేక పుస్తకాలతో పాటు పోటీ పరీక్షలకు ప్రత్యేక సంచికలు వందల సంఖ్యలో అందుబాటులో ఉంచారు.


ఆధునిక రీడింగ్ రూమ్‌లు

విద్యార్థులు సరస్వతీ నిలయంగా భావించే వర్సిటీ గ్రంథాలయంలో అత్యాధునిక మౌలిక వసతులు కల్పించారు. ఇందులో ప్రధానంగా సుమారు వంద కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ, విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో ఏర్పాటు చేసిన కాంపిటేటీవ్ రీడింగ్ రూమ్ ఆకట్టుకుంటున్నాయి. దీంతో పాటు లైబ్రరీలోని పుస్తకాల వివరాలను తెలుసుకునేందుకు ఈ-రీసోర్సెస్ లాంటి అధునాతన టెక్నాలజీని గ్రంథాలయంలో ఏర్పాటు చేశారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు ధీటుగా రాణించేందుకు అవసరమైన పుస్తకాలను ఎప్పటికప్పుడు లైబ్రరీ అధికారులు డే టు డే అప్‌డేట్ చేస్తుంటారు.

పెద్దసంఖ్యలో విద్యార్థులు

కాంపిటేటీవ్ పరీక్షలకు సంబంధించిన మ్యాగజైన్‌లు, మెటీరియల్స్, వార, మాస పత్రికలు, ఎంప్లాయిమెంట్ మ్యాగజైన్లు, వార్తాపత్రికలు ఒకే చోట అందుబాటులో ఉండటంతో విద్యార్థులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ప్రధానంగా కానిస్టేబుల్ ఉద్యోగాల నుంచి గ్రూప్స్, సివిల్స్, ఆర్‌ఆర్‌బీ, బ్యాంక్, ఎస్‌ఎస్‌సీ, డీఎస్సీ, సెంట్రల్ అండ్ స్టేట్ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలు లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి. దీంతో వర్సిటీ విద్యార్థులే కాకుండా నగరంలోని యువత కూడా భారీగానే వచ్చిపోతుంటారు. దీంతో పాటు లైబ్రరీ ఎదుట ఆహ్లాదకర వాతావరణంలో వృక్షాల కింద ఏర్పాటు చేసిన సిట్టింగ్ బెంచ్‌లపై విద్యార్థులు పుస్తక పఠనంలో నిమగ్నమై ఉంటారు.







లైబ్రరీ ఎదుట ఆహ్లాదకర వాతావరణంలో పోటీపరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు, మ్యాగజైన్లు పరిశీలిస్తున్న విద్యార్థులు, కొత్తగా తెప్పించిన పోటీపరీక్షల మెటీరియల్

ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు



వర్సిటీలోని లైబ్రరీలో అన్ని పుస్తకాలు ఉంటాయి. ఉద్యోగసోపానాలతో పాటు సమాచార సంచికలు, అడమిక్ పుస్తకాలు, కాంపిటేటీవ్ జనరల్స్, మెటీరియల్స్ అందుబాటులో ఉంచాం. ఎక్కడా రాజీ పడకుండా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలను తెప్పిస్తుంటాం. ఇక్కడ చదువుకుని వేలాది మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఆ విషయం గుర్తుచేసుకుంటే గర్వంగా ఉంటుంది.

– ప్రొఫెసర్ సురేంద్రబాబు, లైబ్రరీ ఇన్‌చార్జి, ఎస్వీయూ

సద్వినియోగం చేసుకోవాలి



ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీని సరస్వతీ నిలయంగా చెప్పవచ్చు. కరెంట్ ఎఫైర్స్‌కు సంబంధించిన మ్యాగజైన్స్ అందుబాటులో ఉంటాయి. ఐఈఎస్ పోటీ పరీక్షకోసం నిత్యం వర్సిటీ లైబ్రరీ ఆవరణలోనే శ్రమిస్తున్నా. ఇక్కడ చదివిన మహనీయుల మాటలు వింటుంటే మనసు ఉత్తేజితమవుతుంది. చాలా మంది కోచింగ్‌ల పేరుతో కాలం వృథా చేసుకుంటుంటారు. ఈ లైబ్రరీలో దొరికే పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటే చాలు. ఎంచుకున్న రంగంలో రాణించవచ్చు.

– రాజేంద్ర, ఐఈఎస్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థి, తిరుపతి

డిజిటల్ లైబ్రరీ అద్భుతం



నేను డీఎస్సీతో పాటు గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా. వర్సిటీలో లైబ్రరీ ఎదుట ఆహ్లాదకరమైన వాతావరణంలో చదవడం మంచి అనుభూతితోపాటు, ఉత్సాహంగా ఉంటుంది. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికి లైబ్రరీ విజ్ఞాన గనిగా చెప్పవచ్చు. ఇక్కడ దొరకని పుస్తకం అంటూ ఉండదు. విజ్ఞానం పెంపొందించుకునేందుకు సమాచార పత్రికలు, స్టడీ మెటీరియల్స్, అధునాతన అకడమిక్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. డిజిటల్ లైబ్రరీ అయితే అద్భుతమే చెప్పాలి.

– సరిత ప్రియ, డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న విద్యార్థిని, తిరుపతి

డ్యామేజ్.. బాబు ఇమేజ్



ధర్నాలో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి లడ్డూపై ఆరోపణలు గుప్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి డౌన్‌ఫాల్ స్టార్ట్ అయ్యిందని.. ఈ వ్యాఖ్యలతో ఆయన ఇమేజ్ పూర్తిగా డ్యామేజ్ అయ్యిందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ స్పష్టం చేశారు. శనివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదుట కాంగ్రెస్ నేతలతో కలిసి ధర్నా చేపట్టారు. చింతా మోహన్ మాట్లాడుతూ టీటీడీ మేనేజ్‌మెంట్‌ను ప్రపంచమంతా పొగుడుతూ ఉందని.. హార్వర్డ్ యూనివర్సిటీ సైతం టీటీడీ ఉద్యోగుల సేవలను ప్రశంసించిందన్నారు. ఈ క్రమంలోనే శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు, అర్చకులు, శాశ్వత ఉద్యోగులకు అలిపిరి వద్ద ఒక్కొక్కరికి 5 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలని కోరారు. తిరుపతివాసులకు ప్రతి మంగళవారం శ్రీవారి ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పించాలని స్పష్టం చేశారు. సరుకులు కొనుగోలుపై పారదర్శకత ఉండాలని, మార్కెటింగ్ విభాగంలో ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని పదివేల మంది నిరుద్యోగులు, నిరుపేద మహిళలకు ఒక్కొక్కరికి 5 పాడి ఆవులను బ్యాంకు రుణాల ద్వారా ఇప్పించాలని కోరారు. టీటీడీకి అవసరమైన ఆవు నెయ్యిని వారి నుంచి కొనుగోలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపీగౌడ్, రవి, రావణ్, శివ, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ సేవలు అమూల్యం



కలాం జయంతి ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: మన దేశానికి అమూల్యమైన సేవలందించిన మహానుభావుడు డాక్టర్ అబ్దుల్ కలాం అని ఇస్రో ఓఎస్‌డీ లక్ష్మణకుమార్ కొనియాడారు. టీటీడీ సహకారంతో అబ్దుల్ కలాం ట్రస్ట్, రోటరీ సంయుక్త ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో భారత రత్న ఏపీజే.అబ్దుల్ కలాం జయంతి ఉత్సవంతో పాటు అబ్దుల్ కలాం పురస్కారాల ప్రధానోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రొఫెసర్ డాక్టర్ హసీనా మాట్లాడుతూ అబ్దుల్‌కలాం భారత రాష్ట్రపతిగా ఉన్నప్పుడు భారత రాజ్యాంగానికి ఇచ్చిన గౌరవం, ప్రజలతో ఉన్న అనుబంధం ప్రత్యేకంగా గుర్తించదగినవి అని కొనియాడారు. సిటీ చాంబర్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ కలాం యువత కోసం ఎంతగానో శ్రమించారన్నారు. అనంతరం అబ్దుల్ కలాం ట్రస్ట్ నిర్వాహకుడు భాష, ఇస్రో శాస్త్రవేత్త భవానీకుమార్, ఇంటర్నేషనల్ వెటర్నరీ శాస్త్రవేత్తో కరుణానిధి, సర్వీస్ సివిల్ ఇంటర్నేసనల్ జాతీయ అధ్యక్షుడు వైఎస్.యాదవ్, జూనియర్ చాంబర్ జాతీయ ఉపాధ్యక్షుడు హర్షవర్ధన్, డాలర్ దివాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్ అబ్దుల్ కలాం సేవలను వివరించారు. ఈ సందర్భంగా కలాం జాతీయక ఫెలోషిప్ అవార్డులను మురుగేషన్, కొండూరు అశోక్‌కుమార్ రాజా, కె.శాంతి, డాక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి, కె.సుధీర్‌లకు, కలాం జీవిత సాఫల్య అవార్డును ప్రొఫెసర్ స్టాన్లీ జయకుమార్‌కు, కలాం విశిష్ట సేవ అవార్డును గోపీనాథ్, షేక్ హసీనా భానుకు అందిజేసి ఘనంగా సత్కరించారు.అక్షయక్షేత్రం, పాస్, అభయక్షేత్రం, నవజీవన్ సంస్థలకు చెందిన ప్రత్యేక పిల్లలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గోవిందా.. గోవిందా!



మాడవీధుల్లో కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : నగరంలో శనివారం ఉదయం 100 మంది భజన మండలి కళాకారులు, భక్తులు గోవిందనామ స్మరణ చేపట్టారు. తిరునామాలు ధరించి మంగళ వాయిద్యాల నడుమ సంకీర్తనలు ఆలపిస్తూ గోవిందరాజస్వామి ఆలయ మాడ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన మండలి కళాకారులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, సూర్యప్రకాష్, విజయభాస్కర్, వాసుదేవరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, విగ్రమ్, జేజిరెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, గంగటయ్య, మురళి, రెడ్డిబాబు, జయమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





శ్రీవారి ఆలయం వెలుపల వెంకటేశన్, రఘోత్తమ్‌రెడ్డి

తిరుమల : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వారిలో జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు ఇచ్చారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

పులకించిన అలిపిరి



పెరటాసి మాసం చివరి శనివారం సందర్భంగా అలిపిరి పాదాల మండపానికి భక్తులు పోటెత్తారు. వైకుంఠనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి పులకించారు. గోవిందనామాలను స్మరిస్తూ పరవశించారు. నారికేళాలు సమర్పించి భక్తిప్రపత్తులను చాటుకున్నారు. పిండి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

– తిరుపతి కల్చరల్

పనిభారం తగ్గించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రుయా ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : పనిభారం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని రుయా ఆస్పత్రిలోని నాలుగో తరగది ఉద్యోగులు కోరారు. శనివారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందంచారు. 1,268 పడకల రుయా ఆస్పత్రిలో కేవలం 85 మంది మాత్రమే నాలుగో తరగతి ఉద్యోగులు ఉన్నారని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ముని చంద్ర, నరసింహులు సలహాదారు గురవయ్య వెల్లడించారు. దీంతో రోజు రోజుకూ పని ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ నాటికి నూతన సిబ్బందిని రిక్రూట్ చేస్తామని, పని భారం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నేతలు కాంచనమాల, హరి కుమార్, రాధ, కుమారి దేవి, రమేష్, ముని వెంకట రామయ్య పాల్గొన్నారు.

వెటర్నరీలో ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



ధ్రువీకరణ పత్రం అందిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాల నిరంతర వైద్య విద్య సమాచార కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన సీమ పందుల పెంపకంలో శాస్త్రీయ విధానంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి పరిశోధన సంచాలకులు డాక్టర్ సీహెచ్ శ్రీలత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతులు, యువత పందుల పెంపకంపై నూతన పద్ధతులపై శిక్షణ పొందడం శుభపరిణామన్నారు. అనంతరం శిక్షణ పొందిన ఔత్సాహికులకు ధ్రువపత్రాలు అందజేశారు. డాక్టర్ కే.సుజాత, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుచ్చిపై శ్రీవారి చిద్విలాసం



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. అనంతరం శ్రీవారికి అభిషేక సేవ నిర్వహించి వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు ఆగమోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు.సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుద్దీపాల నడుమ దేవదేవేరులకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకర శోభితుడైన శ్రీనివాసుడు, అమ్మవార్లతో బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై మాడవీధులలో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్‌పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, అర్జితం ఇన్స్‌పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో 'క్లీన్ అండ్ గ్రీన్'



క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో విద్యార్థులు, అధికారులు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో శనివారం 'క్లీన్ అండ్ గ్రీన్' చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ బ్యూరో, ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమానికి రిజిస్ట్రార్ భూపతి నాయుడు శ్రీకారం చుట్టారు. రిజిస్ట్రార్ ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు తట్టుకునేందుకు, జీవజాతికి మేలు చేకూరేందుకు చెట్లు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్రాయుడు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ, దామోదరం, కల్చరల్ కో–ఆర్డినేటర్ వివేక్ పాల్గొన్నారు.